క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఏ (హెచ్ఈపీ), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ, బీజెడ్సీ నందు ఖాళీగా ఉన్న సీట్లకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దోస్త్ రిజిస్ట్రేషన్ ఈనెల 27 నుంచి ఆగస్ట్ 2వరకు చేసుకోవాలని కోరారు.

కూలిన ఇంటి గోడ

ఇంద్రవెల్లి: వారం రోజులుగా కురుస్తున్న ముసురు ఇంటి గోడ కూలిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని భీంనగర్‌కు చెందిన విటేకర్ దిలీప్ ఇంటి గోడ పూర్తి తడిసి శుక్రవారం తెల్లవారుజామున కూలింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రలో ఉన్నారు. వెనుకభాగం గోడ పడిపోవడంతో ప్రమాదం తప్పిందని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకొని కూలిన గోడను పరిశీలించారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

నార్నూర్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్) ప్రిన్సిపాల్ అంజనేయులు అన్నారు. శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు పార్టీ నిర్వహించారు. నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. అలాగే బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్‌ను విద్యార్థులు సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శంకర్ భారీ, ఉపాధ్యాయులు అనుములు ఓదేలు, సిబ్బంది పాల్గొన్నారు.

వంటల్లో నాణ్యత పాటించాలి

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన వంటలు వండాలని ఇచ్చోడ ఏటీడీవో అమిత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశ్రమ బాలికల పాఠశాలలో వంట మనుషులు, కామాటిలకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం, రాత్రి వేళలలో వండే భోజనం వేడి వేడిగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పీజీహెచ్ఎం గోడం చందన్, జీసీడీవో మెస్రం ఛాయ, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, కాత్లె ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డిఐఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, ప్రతీరోజు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య, కళాశాలలో నెలకొన్న సమస్యలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు శ్రావణ్ రాథోడ్, మాదాసు మధుకర్, శ్రీనివాస స్వామి, సీనియర్ అసిస్టెంట మల్లేషం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, వాపార దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిసర ప్రాంతంలోని నాలా స్థలంలో అక్రమంగా నిర్మించిన వ్యాపార షెడ్డులను పరిశీలించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములు అక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధికారులు గంగారం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాంసి: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ గంగారం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, మహిళల హక్కులు గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అశోక్, అసిస్టెంట్ కౌన్సిల్ ఉమేష్‌రావు డోలే, ఏఎస్సై కేశవ్ స్వామి పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

బోథ్: విద్యుత్ వినియోగదారులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు.త శుక్రవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం 200ల యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తు చర్యలు తీసుకుంటామన్నారు. వెంట ఏఈఈ విజయ సారథి, నాగరాజు, ఏఈ వెంకటేశ్ పాల్గొన్నారు.

యుద్ధవీరులకు నివాళి

- ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



ఎదులాపురం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా కార్గిల్‌లో చనిపోయిన అమరవీరుల పేర్లతో 30 మొక్కలు నాటారు. వీటిని సంరక్షించే బాధ్యత ఎన్‌సీసీ క్యాడెట్లకు అప్పగించారు. అదే విధంగా కొవ్వొత్తులతో నివాళులర్పించి మౌనం పాటించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కవల్‌జీత్ సింగ్, జగ్‌రాం, అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు ప్రతాప్ సింగ్, రఘునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన అమర జవాన్లకు బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు నివాళులర్పించారు. మున్సిపల్ పార్కులోని స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, సాజిదొద్దీన్, ప్రకాష్, పవన్ నాయక్, శ్రీను పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కార్గిల్ విజయోత్సవ దినం సందర్భంగా మున్సిపల్ పార్కులో లయన్స్ క్లబ్ కాటన్ సిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 60 రోజుల పాటు సాగిన పోరాటంలో 526 మంది సైనికులు వీర మరణం పొందారని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం వారి ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు రవీంద్ర, ప్రేమ్, రాజ్‌గౌడ్, భగవాన్, ప్రకాష్, మధుసూదన్, దేవిదాస్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో శుక్రవారం భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో అమరవీరులు సాధించిన విజయం జ్ఞాపకార్థకంగా ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అమరవీరులకు జోహార్లు, భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు అగర్కార్ అకాష్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బెదుర్కర్ ప్రఫుల్, గేడాం ప్రవీణ్, బర్కాడే రాము, ప్రీతం, రోహిత్, స్వప్నిల్ పాల్గొన్నారు.

ఎదులాపురం: కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన భరతమాత ముద్దుబిడ్డలు కార్గిల్ వీరులకు కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కార్గిల్ పార్క్‌లోని కార్గిల్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, జైనథ్ మాజీ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, జహీర్ రంజాని, గిమ్మ సంతోష్,



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు

లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: ప్రతిఒక్కరూ దేశ సేవ కోసం పాటుపడాలని హెచ్ఎం రామేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కార్గిల్ దివస్ నిర్వహించారు. దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న జవాన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, రాజేందర్, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాస్ స్వామి, ఆంజనేయులు, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నందకిషోర్, దేవిదాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బేల: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



తలమడుగు: జవాన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వంశీకృష్ణ 352మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మండల ప్రత్యేకాధికారి శంకర్, హెచ్ఈవో రాంరెడ్డి, ప్రిన్సిపాల్ రంగన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సర్పరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్ధరి ఖానాపూర్‌లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 63 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యుడు మాట్లాడుతూ వంట గది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోళ్లు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, కొడప యశోద, మర్సకోల లక్ష్మి బాయి, ఎంఎల్‌హెచ్‌పీ ఆకాంక్ష, ల్యాబ్ టెక్నీషన్ శ్రీనివాస్ మడావి, ఆరోగ్య సహాయకులు రాథోడ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాంసి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున్న ప్రతిఒకరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాంసి వైద్యాధికారి శ్రావ్య అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పారబోయాలని, మురికినీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించి తాగునీటి వద్ద క్లోరినేషన్ చేయించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తులసీరాం, ఏఎన్ఎం లక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారి సౌజన్య, శ్రీలత, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తలమడుగు: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఆదిలాబాద్ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, చంద్రశేఖర్, ఎంపీవో సుధీర్ రెడ్డి, ఏపీవో మేఘమాల, హాస్టల్ వార్డెన్, నర్సింహులు, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రమణ, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటిన ప్రతిమొక్కనూ రక్షించాలి

ఇంద్రవెల్లి: హరితవనం కార్యక్రమంలో నాటిన ప్రతిమొక్కనూ రక్షించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేస్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రం, ఆశ్రమ వసతి గృహాన్ని సందర్శించి ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

తాంసి: వర్షాలతో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున్న పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తాంసి మండల ప్రత్యేకాధికారి వెంకట రమణ సూచించారు. శుక్రవారం గోట్కూరి గ్రామాన్ని ఎంపీడీవో మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామంలో మురికి కాలువలు, చెత్త సేకరణ, శానిటేషన్ పనులను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ప్రత్యేకాధికారికి విన్నవించారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయన్నారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, దేవిదాస్, భగవాండ్లు, రోహిత్, అశోక్, సురేశ్ ఉన్నారు.

జైనథ్: మండలంలోని బెల్లూరిగూడ గ్రామంలో జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో డ్రై డే- ఫ్రై డే నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ.. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఖాళీ స్థలాలు, టైర్లు, నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



నిల్వ నీటిని తొలగిస్తున్న మెడికల్ ఆఫీసర్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

తలమడుగు: అర్హులైన ప్రతీ రైతు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఎరువులు, రుణమాఫీ రైతుల వివరాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం ప్రవేశపెట్టి రైతుబీమాకు అర్హులైన ప్రతీ రైతు ఈనెలాఖరుకల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాత, కొత్త పట్టాదారు పుస్తాకాలు వచ్చిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో మోతే శ్రీనివాస్, గంగయ్య, సాగర్, భీమ్‌రావు, రమాకాంత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

జాగ్రత్తలు పాటించాలి

జైనథ్: ప్రతిఒక్కరు తప్పనిసరిగా వర్షకాలంలో జాగ్రత్తలు పాటించాలని జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని డొల్లార, ఆనంద్‌పూర్, తరోడ బ్రిడ్జిలు, సాత్నాల ప్రాజెక్ట్ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వర్షాలు కురుస్తున్నందున పెన్‌గంగకు ప్రవాహం బాగా పెరిగిందని, ఈతకు, చేపలు పట్టేందుకు వెళ్లరాదని సూచించారు.

ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం కాలనీలో శుక్రవారం మాట్లాడారు. ఆగస్టు 9న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ప్రపంచ ఆదివాసీ పోరాట సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా నాయకులు మనోజ్, తులసీరాం, ప్రకాశ్, శాంతాబాయి, రాంచందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటూ దళితుల పంటల రుణాలను వెంటనే మాఫీ చేయాలని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శుక్రవారం ఏజెన్సీ దళిత రైతులకు మద్దతుగా గాంధీచౌక్ వద్ద దళిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఏకకాలంలో లక్ష రూపాయాలు రుణమాఫీ చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. ఈనెల 29న జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, తొడసం నాగోరావు, ఉర్వేత రూప్‌దేవ్, సయ్యద్ ఖాశీం, చంద్రశేఖర్ లోఖండే, జాదవ్ చంద్రశేఖర్, విష్ణు రాథోడ్, ఫెరోజ్‌ఖాన్, హన్మంతరావు, బాబాఖాన్, శివాజీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిల్వ నీటితో దోమల వ్యాప్తి

బోథ్: ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉంచకూడదని మండలంలోని కనుగుట్ట గ్రామంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అనంతరం నిల్వ నీటిని పారబోశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, ఏఎన్ఎం పావని, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశ కార్యకర్త జలజ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఓరగంటి రాములు కాన్సర్‌తో బాధపడుతున్నాడు విషయం తెలుసుకున్న బోథ్‌కు చెందిన మదర్స్ డ్రీమ్ ఫౌండేషన్ సభ్యులు రాములు చికిత్స కోసం రూ. 5000ల ఆర్థిక సాయం శుక్రవారం రాములు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాకేశ్, జీవన్ రెడ్డి, శ్రావణి, సాయికృష్ణ, వినోద్, సాయికృష్ణ పాల్గొన్నారు.

బోథ్‌లో మరో పీటీఆర్ ఏర్పాటు

బోథ్: మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరో పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ జె.చౌహాన్ తెలిపారు. శుక్రవారం బోథ్, పొచ్చెర విద్యుత్ సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. బోథ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఓవర్ లోడ్ కాకుండా ఇప్పుడున్న పీటీఆర్‌తో పాటు మరో పీటీఆర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వెంట ఎంఆర్‌టీ డీఈ ప్రభాకర్, సబ్ ఇంజనీర్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

తాంసి: జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించే బీసీ సంఘం జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి బీసీలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కొనసాగుతున్న నిత్యాన్నదానం

ఎదులాపురం: కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడేళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం అన్నదాన కేంద్రాన్ని సందర్శించారు. ప్రతీరోజు వందలాది మంది ఆకలి తీర్చుతుండటం తృప్తినిస్తుందని పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలతో వర్షపునీరు నిలిచి భీంపూర్ మండలంలోని అంత రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది గుంతలో నిలిచిన వర్షపునీటితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం భీంపూర్ మండలంలో పర్యటించిన కలెక్టర్ రాజర్షి షా అధ్వానంగా మారిన రోడ్డును పరిశీలించారు. వెంటనే రోడ్డు బాగు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖ అధికారులు రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీటిని జేసీబీ తొలగించారు. అనంతరం మరమ్మతులు చేపట్టారు.

డొంగర్‌గాంలో గావ్‌సాత్ పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్‌లో గావ్‌సాత్ పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ కుటుంబ సమేతంగా గ్రామ పొలిమేరకు వెళ్లి పోచ్చమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజలు చేయడం ద్వారా ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెందోర్ బాదుపటేల్, ఆర్క సెద్ము, పెందోర్ బందు, లింబారావ్, కోవ ఇస్తు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

బోథ్: ఆదిలాబాద్ జిల్లాతో పాటు బోథ్ నియోజకవర్గానికి రాష్ట్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బోథ్ రెవెన్యూ డివిజన్, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, బోథ్ నుంచి తరలిన కార్యాలయాలను రప్పించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని మండిపడ్డారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు జి.వి.రమణ, మండల అధ్యక్షుడు బోరె రవీందర్, ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారాం, పిడుగు అశోక్ రెడ్డి, సుభాష్ సూర్య, జక్కుల వెంకటేశ్, రంజిత్, హరీష్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మంత్రి గారు.. పాఠశాల ప్రారంభించండి



పెచ్చులూడిన పైకప్పు



నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం

- పాఠశాలకు రాజకీయ గ్రహణం
- పెచ్చులూడుతున్న గదుల్లోనే విద్యాభ్యాసం

బోథ్: రాజకీయ నాయకులు ఆడుతున్న క్రీడలో పాఠశాల విద్యార్థులు ఓడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, నాయకులు తమ పంతాలకు పోయి విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తున్నారు. నూతన పాఠశాల భవనం పూర్తైనా.. పాఠశాలను ప్రారంభించడానికి ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య పోటీ విద్యార్థుల పట్ల శాపంగా మారింది. మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల భవన నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. శిథిలావస్థకు చేరుకొని వర్షపు నీరు తరగతి గదుల్లోకి వస్తుంది. దీంతో విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. నూతన పాఠశాల పూర్తయినా ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ గ్రహణం..

నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నా.. ప్రజాప్రతినిధులకు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రెండుసార్లు ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఇటీవల బీజేపీ ఎంపీ నగేశ్ ప్రారంభిస్తారని నాయకులు పేర్కొన్నారు. కానీ ప్రారంభోత్సవ కార్యక్రమం రద్దయింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభిస్తారని పలువురు పేర్కొంటున్నారు. కానీ ప్రారంభోత్సవం మాత్రం జరగడం లేదు.

వర్షాలు తగ్గిన తరువాత ప్రారంభిస్తాం

సొనాలలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల భవనాన్ని రూ. 1.20 లక్షలతో నిర్మించాం. ఇప్పటికే రెండుసార్లు పాఠశాల భవన ప్రారంభోత్సవం అనివార్య కారణాల వల్ల రద్దయింది. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున వర్షాలు తగ్గుముఖం పట్టాక ప్రారంభిస్తాం.

– అశోక్ కుమార్, ఈఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ